నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, శనివారం 14 జూన్ 2025 | MAHABUBABAD

## హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ బాధ్యతల స్వీకరణ



హనుమకొండ, జూన్ 13 : హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా స్నేహ శబరీష్ శుక్రవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్త కలెక్టర్‌కు అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేశ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జడ్పీ సీఈవో విద్యాలత, ఇతర శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఉద్యోగులు పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# క్లీన్ సిటీగా తీర్చిదిద్దుతా

- అందరి సహకారంతో అభివృద్ధి చేస్తా
- గ్రేటర్ వరంగల్ కొత్త కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్
- శుభాకాంక్షలు తెలిపిన వివిధ విభాగాల అధికారులు



బల్దియా కమిషనర్‌గా బాధ్యతలు చేపడుతున్న చాహత్ బాజ్‌పాయ్

వరంగల్, జూన్ 13 : అధికారులు, ఉద్యోగుల సహకారంతో నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని బల్దియా కొత్త కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్‌లో పనిచేసిన అనుభవం ఉన్నదని, మున్సిపల్ సర్వీస్‌లపై అవగాహన ఉన్నదని చెప్పారు. చారిత్రక నగరమైన వరంగల్‌కు కమిషనర్‌గా రావడాన్ని మంచి అవకాశంగా భావిస్తున్నానని.. ముఖ్యంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తానని పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా నగరంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. పారిశుధ్య విభాగంలో కార్మికుల సంఖ్య, చెత్త తరలింపు వాహనాలు, జీపీఎస్ అనుసంధానం, తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### శుభాకాంక్షల వెల్లువ

కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్‌కు బల్దియా ఉద్యోగుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పూల మొక్కలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ కమిషనర్లు రాజేశ్వర్, రవీందర్, ప్రసన్నరాణి, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ రాజేశ్, ఇన్‌చార్జి ఈఈ శ్రీనివాస్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, పీఆర్‌వో ఆయూబ్ అలీ, ఈఈలు, డీఈలు, ఆర్‌వో, ఆర్‌ఐలు పాల్గొన్నారు.





వనంగల్ కలెక్టర్ సత్యశారద, బదిలీపై వెళ్తున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



నకిలీ పత్తి విత్తనాలు, నిందితులతో పోలీసులు, వ్యవసాయ అధికారి

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

- 300 లీటర్ల గ్లైఫోసెట్ స్వాధీనం
- ఆంధ్రా నుంచి తీసుకొచ్చిన అక్రమార్కులు

జిల్లాలోని కాటారం, మహాముత్తారం మండలాల్లో పెద్ద ఎత్తున నకిలీ పత్తి విత్తనాలతో పాటు గ్లైఫోసెట్ కలుపు మందును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహాముత్తారం ఎస్సై మహేందర్ కుమార్, సిబ్బంది, మండల వ్యవసాయ అధికారి అనూష రెండు మండలాల్లో దాడులు చేసి వీటిని స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం ఘనీపూడి గ్రామానికి చెందిన అచ్చ హనుమంత రావు, కాటారానికి చెందిన లావణ్య ఎరువుల దుకాణం వ్యాపారి బొమ్మ సమ్మిరెడ్డి, మల్హర్ మండలం పాత రుద్రారానికి చెందిన జాడి సమ్మయ్య, మహాముత్తారం మండలం నల్లగొండ, మీనాజీపేట గ్రామాలకు చెందిన చీర్ల సతీశ్, బుచ్చిరెడ్డి, కాటారం గ్రామానికి చెందిన బొమ్మన వెంకటస్వామి, కందుల కోటేశ్వర్‌రావు, సుబ్బయ్య వద్ద నుంచి రూ. 5 లక్షల విలువ చేసే 202 కిలోల పత్తి విత్తనాలు, 300 లీటర్ల నిషేధిత గ్లైఫోసెట్ కలుపు మందును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# సరిహద్దులు దాటి నకిలీ దందా !

## మహారాష్ట్ర టు భూపాలపల్లి..

జోరుగా నిషేధిత విత్తనాల రవాణా

- బడా నేతల కనుసన్నల్లోనే దందా?
- గుట్టు చప్పుడు కాకుండా సరిహద్దు గ్రామాల్లో నిల్వ
- నమ్మకమైన వ్యక్తుల ద్వారా రైతులకు విక్రయాలు
- ఏటా భారీగా నష్టపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని పోలీసులు, అధికారులు

*అన్నదాతకు నకిలీ, నిషేధిత విత్తనాల బెడద తప్పడం లేదు. ఏటా ఆర్థికంగా నష్టపోతున్నా నకిలీ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. విత్తన వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలూ అమలుకు నోచుకోవడం లేదు. మహారాష్ట్ర నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు నకిలీ విత్తనాలు జోరుగా రవాణా అవుతున్నా అధికారుల్లో చలనం లేదు. కాళేశ్వరం, మేడిగడ్డ బరాజ్ వంతెనల మీదుగా గ్రామాల్లోకి తీసుకొచ్చి నిల్వ చేస్తున్నా.. విక్రయాలు జరుపుతున్నా.. వాటిని పట్టుకునే దిక్కులేదు. ఈ దందా వెనుక బడా నేతలున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతుండగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.*

*- జయశంకర్ భూపాలపల్లి, జూన్ 13 (నమస్తే తెలంగాణ)*

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విత్తన మాఫియా కోరలు చాస్తున్నది. అధిక దిగుబడి వస్తుందని రైతులకు ఆశ చూపుతున్న దళారులు నిషేధిత విత్తనాలు కట్టబెడుతూ లక్షల్లో సంపాదిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి కాళేశ్వరం, మేడిగడ్డ బరాజ్ వంతెనల మీదుగా జిల్లాలోకి నకిలీ విత్తనాలు చేరుతున్నట్లు సమాచారం. వీటిని సరిహద్దు గ్రామాల్లో నిల్వచేస్తున్న దళారులు అక్కడి నుంచి వివిధ మార్గాల్లో వారికి నమ్మకమైన వ్యక్తుల వద్దకు తరలించి జోరుగా విక్రయాలు జరుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ క్రమంలో కాటారం సమీపంలోని ఒక మండలంలో రూ. లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు దిగుమతి కాగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు ప్రచారం జరిగినా ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదు. పోలీసులు సైతం ఎలాంటి ప్రకటన చేయలేదు. గ్లైపోసెట్‌తో పాటు క్వింటాళ్ల కొద్దీ బీటీ 3 పత్తి విత్తనాలు లభ్యమైనట్లు కొందరు రైతులు స్వయంగా చెబుతున్నారు. ఏటా ఇదే దందా కొనసాగుతూ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నా అధికారులు మాత్రం నకిలీ విత్తనాల వ్యాపారాన్ని పూర్తి స్థాయిలో అదుపులోకి తీసుకురావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### అధికారుల సూచనలు

- ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణం నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి
- తక్కువ ధరకు వస్తున్నాయని ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేయొద్దు
- విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం దుకాణాదారుల నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి
- విత్తనాల ప్యాకెట్‌పై ఉన్న లేబుల్, టోల్ నంబర్లను రసీదుపై తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి
- ముందస్తుగా విత్తనాలు మొలకెత్తే శాతాన్ని ప్యాకెట్‌పై చూసుకుని కొనుగోలు చేయాలి
- పంటను విత్తిన తర్వాత తప్పనిసరిగా విత్తన ప్యాకెట్లు, రసీదును భద్రపర్చుకోవాలి
- దుకాణాలు, గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే వ్యవసాయాధికారికి సమాచారం ఇవ్వాలి

### దందాకు అండ ఎవరు?

రెండు రాష్ట్రాల సరిహద్దు కేంద్రంగా జరుగుతున్న నకిలీ విత్తనాల దందాకు అండగా ఎవరు నిలుస్తున్నారన్న విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల నిఘాలోపంతోనే పోలీస్ స్టేషన్‌లు దాటి జిల్లాలోని పలు గ్రామాల్లో భారీగా నకిలీ విత్తనాల నిల్వ జరుగుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు బడా నేతల కనుసన్నల్లోనే ఈ అక్రమ దందా కొనసాగుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దళారులు నిషేధిత జీఎం (జెనెటికల్లీ మోడిఫైడ్) బీటీ 3, బోల్‌గార్డ్ 3 (బీటీ 3) పత్తి విత్తనాలను కాటారం సబ్ డివిజన్‌లో నిల్వ చేసి బడా రైతులతో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తున్నది. అయితే దళారులు తమ విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు గడ్డిని నియంత్రించే నిషేధిత గ్లైఫోసెట్ మందును ఉచితంగా అందిస్తున్నట్లు సమాచారం. పోలీసులు ఇటీవల జరిపిన దాడుల్లో బీటీ 3 విత్తనాలతో పాటు నిషేధిత గడ్డి మందు కూడా పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే కొందరు బడా నేతలు ఈ విషయం బయటకు రాకుండా పైరవీలు చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. అలాగే జిల్లాలోని చిట్యాల మండలంలో గురువారం రూ. 32 వేల విలువ గల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విత్తనాలు సైతం సిరొంచ నుంచి తీసుకొచ్చినట్లు దళారులు పోలీసుల ముందు ఒప్పుకున్నారు. దీనిని బట్టి మహారాష్ట్ర నుంచి ఏ మేరకు నకిలీ విత్తనాలు వస్తున్నాయో అవగతమవుతున్నది.

## జీలుగ భారం.. రైతులు దూరం

- ప్రభుత్వం ధర పెంచడంతో కొనేందుకు అనాసక్తి
- వేల సంఖ్యలో అమ్ముడుపోని బస్తాలు
- తిరిగి వెనక్కి పంపించే పనిలో అధికారులు
- బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న దళారులు



హరిపిరాల ఆగ్రోస్‌లో నాసిరకం జీలుగ విత్తనాలు

తొర్రూరు, జూన్ 13 : కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది జీలుగు విత్తనాల ధరలు భారీగా పెంచడం, అవి నాసిరకంగా ఉండడంతో రైతులు వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపలేదు. దీంతో వేల సంఖ్యలో మిగిలిన బస్తాలు తిరిగి వెనక్కి పంపించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. 30 కిలోల జీలుగ విత్తన బస్తా ధర గత ఏడాది రూ.1,116 ఉండగా, ఈ సారి దానిని రూ.2,137కి ప్రభుత్వం పెంచింది. ఒక్కో బస్తాపై దాదాపు రూ.1,000 అదనంగా చెల్లించాల్సి వస్తుండడంతో రైతులు వీటికి దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాలకు మొత్తం 25,076 జీలుగు బస్తాలు కేటాయించగా, కేవలం 8,430 బస్తాలు మాత్రమే అమ్ముడయ్యాయి. మిగతా 16,649 బస్తాల విక్రయం జరగకపోవడంతో వాటిని మళ్లీ వెనక్కి పంపిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. కొన్ని మండలాల్లోనే వీటి అమ్మకాలు ఎక్కువగా ఉండగా, చాలా చోట్ల రైతులు ముఖం చాటేశారు. ఇదే అదనుగా భావించిన దళారులు జీలుగ విత్తనాలను బ్లాక్ మార్కెట్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల తొర్రూరు పట్టణానికి చెందిన చలువాది ఉపేందర్ జనగామ జిల్లాలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల నుంచి సేకరించిన 69 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను ఆంధ్రప్రదేశ్ నరసరావుపేటకు అక్రమంగా తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఉపేందర్‌తో పాటు ఏజెంట్లు శ్రీనివాసరెడ్డి, సురేశ్ సహా మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

### అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాం..

మహబూబాబాద్ జిల్లాలో ప్రస్తుతం మిగిలి ఉన్న జీలుగ విత్తనాలను తక్కువ నిల్వలున్న ఇతర జిల్లాలకు సరఫరా చేసేందుకు సిద్ధం చేశాం. రైతులందరికీ విత్తనాలు అందేలా తగిన ఏర్పాట్లు చేశాం. అర్హత ఉన్న ప్రతి రైతు ఆన్‌లైన్ కూపన్ ద్వారా విత్తనాలు పొందేలా చర్యలు తీసుకున్నాం. దీని ద్వారా పారదర్శకతతో పాటు విత్తనాల కొరత లేకుండా చూస్తున్నాం. జీలుగ విత్తనాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలతో కలిసి పనిచేస్తున్నాం. ఇప్పటికే జీలుగ విత్తనాల తరలింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే ఎవరైనా ఎలాంటి విత్తనాల అక్రమ దందాకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎం విజయనిర్మల, వ్యవసాయ అధికారి, మహబూబాబాద్ జిల్లా

## ఎటుచూసినా చెత్త కుప్పలే..

**కంపుకొడుతున్న పాత బీట్ బజార్**

ఉమ్మడి వరంగల్ జిల్లాకు కిరాణా సరుకుల వ్యాపార కేంద్రంగా ఉన్న పాత బీటుబజార్‌లో ఎటు చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. నిత్యం కొన్ని క్వింటాళ్ల చెత్త రోడ్లపై పేరుకుపోతున్నది. మురుగునీరు పారాల్సిన నాలాల్లో చెత్త చేరి పూర్తిగా పూడుకుపోయాయి. దీంతో వరంగల్ బస్టాండ్, గిర్మాజీపేట, బట్టల బజార్ ప్రాంతాల నుంచి వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. మురుగునీటి కాల్వల విస్తరణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే ఇలా జరుగుతున్నదని వ్యాపారులు వాపోతున్నారు.

- వరంగల్ చౌరస్తా, జూన్ 13




పాతబీటు బజార్‌లో పేరుకుపోయిన చెత్త

## చెత్త కుండీలా ట్రాక్టర్ ట్రాలీ

బయ్యారం, జూన్ 13 : పంచాయతీ ట్రాక్టర్ చెత్తకుండీలా మారింది. గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో జీపీ ట్రాక్టర్లు నడపడం తమ వల్ల కాదని కార్యదర్శులు ఇటీవల ట్రాక్టర్ల తాళాలను అధికారులకు అప్పగించారు. బయ్యారం మండలం బాల్యతండా గ్రామంలో చెత్త ట్రాక్టర్ తిరగకపోవడంతో స్థానికులు కొందరు ఇలా తమ చెత్తను ఎక్కడ పోయాలో తెలియక గ్రామపంచాయతీ కార్యాలయ సమీపంలో నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రాలీలో చెత్తను పోసి వెళ్లారు. చెత్త ట్రాక్టర్ నిండడంతో కింద పడుతూ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇది చూసిన పలువురు చెత్త తరలించాల్సిన ట్రాక్టర్.. చెత్తకుండీలా మారిందని చర్చించుకోవడం గమనార్హం.




## విధులను వదిలి.. కొండా వెంట వెళ్లి..

- మురళికి ఎస్కార్ట్‌గా తూర్పు పోలీస్ అధికారులు
- మరోసారి హద్దు దాటి ప్రవర్తించిన ఖాకీలు



కొండా మురళికి ఎస్కార్ట్‌గా వెళ్తున్న పోలీస్ వాహనం

సుబేదారి, జూన్13 : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలీసు అధికారులు మరోసారి హద్దు దాటి వ్యవహరించారు. ఎలాంటి ప్రొటోకాల్ లేని వ్యక్తికి ఎస్కార్ట్‌గా వెళ్లి ఆ శాఖ పరువు తీశారు. మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీధర్‌రావు శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం 34, 39వ డివిజన్లలోని శాంతినగర్, లక్ష్మీనగ ర్, జన్మభూమి జంక్షన్‌లో సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు బొల్లం రమేశ్, షుకూర్, తుమ్మ గోపిరెడ్డి, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్సైలు విధులకు డుమ్మా కొట్టి కొండా మురళి వాహనానికి రోజంతా ఎస్కార్ట్‌గా వెళ్లారు. దీంతో ఆయా పోలీసు స్టేషన్లకు వచ్చిన బాధితులు ఇబ్బందులు పడ్డారు. గతంలోనూ కొండా మురళి ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు కూడా ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఎస్కార్ట్‌గా వెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా తూర్పు పోలీసు అధికారులు ప్రవర్తించిన తీరు సైతం విమర్శలకు దారి తీసింది.

## బాల్ బ్యాడ్మింటన్ విజేత వరంగల్.. కబడ్డీలో నల్గొండ

**జేఎన్ఎస్‌లో ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడలు**

హనుమకొండ చౌరస్తా, జూన్ 13 : తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ 2025-26 హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో శుక్రవారం ముగిశాయి. ఈ టోర్నీలో భాగంగా కబడ్డీ 12 జట్లు, బాల్ బ్యాడ్మింటన్ 9 జట్లు పోటీ చేయగా కబడ్డీ నల్లగొండ మొదటి స్థానం కైవసం చేసుకోగా రెండో స్థానం వరంగల్ జట్టు, తృతీయ స్థానం నిజామాబాద్ నిలిచాయి. బాల్ బ్యాడ్మింటన్ మొదటి స్థానం వరంగల్ జట్టు, రెండో స్థానం మహబూబ్‌నగర్, తృతీయ స్థానం నల్గొండ జట్లు కైవసం చేసుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ హెచ్ఆర్డీ బి.అశోక్‌కుమార్, ఇన్‌చార్జి డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్, హనుమకొండ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.మధుసూదన్‌రావు, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఏ విజయేందర్‌రెడ్డి, సాంబరెడ్డి, మల్లికార్జున్, ఎన్.జగన్నాథ్, ఎం.సంతోష్‌కుమార్, ఎండీ.యాకూబ్‌పాషా, వి.సునీల్‌కుమార్, ఈ.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



బాల్ బ్యాడ్మింటన్ విజేత వరంగల్ జట్టు

## సమాజ మార్పు కోసం నాటకాలను ఆదరించాలి

- ప్రముఖ రచయిత బన్న అయిలయ్య
- అట్టహాసంగా జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రముఖ రచయిత బన్న అయిలయ్య

పోచమ్మమైదాన్, జూన్ 13: నేటి టెక్నాలజీ యుగంలో యువత సినిమాలు, టీవీలకే పరిమితమవుతున్నారని, సమాజ మార్పు కోసం నాటకాలను ఆదరించాలని రిటైర్డు ప్రిన్సిపాల్, ప్రముఖ రచయిత బన్న అయిలయ్య కోరారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఎఫ్‌డీసీ, ఐక్యవేదిక పర పతి సంఘం సౌజన్యంతో వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక 16వ ఉభయ రాష్ట్రాలస్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు పోతన విజ్ఞాన పీఠంలో శుక్రవారం రాత్రి అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ సమాజానికి మంచి చెబుతున్న నాటకాలను అందరూ ఆదరించాలన్నారు. ప్రముఖ కవి గిరిజామనోహర్ మాట్లాడుతూ నాటకాలను ప్రజలు ప్రోత్సహించడం వల్ల సమాజంలో కొంత వరకైనా మార్పు వస్తుందని, ఇందుకు కళాపోషకులు కళాకారులకు ప్రేరణ కలిగించాలని కోరారు. రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం మాట్లాడుతూ నాటక రంగ పునరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కళా పోషకుల ద్వారా సహాయం అందేలా చూస్తానన్నారు. వరంగల్ జిల్లా నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు మాడిశెట్టి రమేశ్ మాట్లాడుతూ యువత నాటక రంగం వైపు మొగ్గు చూపడానికి ప్రభుత్వం నంది, గరుడ వంటి విశిష్ట సంస్థలు నిర్వహించిన నాటక పోటీల్లో ప్రదర్శన చేసిన వారికి సర్టిఫికెట్స్, భవిష్యత్‌లో ఉద్యోగాలకు తగిన కోటా కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కాకతీయ నృత్య కళా క్షేత్రం డాక్టర్ వెంపటి శ్రావణి శిష్య బృందంతో శాస్త్రీయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ కాజీపేట తిరుమలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మీయ అతిథి డాక్టర్ బండారు ఉమామహేశ్వర్‌రావు, నాగపురి సంజయ్‌బాబు, గడ్డం యుగంధర్ పాల్గొన్నారు.

### పలు నాటకాల ప్రదర్శన

చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ వారిచే రవీందర్‌బాబు రచన, దర్శకత్వంలో మా ఇంట్లో మహాభారతం నాటికను ప్రదర్శించారు. ఇందులో సమాజంలోని ప్రతి ఇంటిలో నెలకొన్న సమస్యల ఇతివృత్తాన్ని వివరించారు. నిజామాబాద్ తన్మయ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శ్రీనివాసరెడ్డి దర్శకత్వంలో చదువు నాటికను ప్రదర్శించారు. నేటి సమాజంలో చదువుకు ఉన్న విలువలను వివరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఎన్ఎస్ఆర్ మూర్తి, వేముల ప్రభాకర్, జేఎన్ శర్మ, ఆకుతోట లక్ష్మణ్, సాధుల సురేశ్, బీటవరం శ్రీధరస్వామి, కుసుమ సుధాకర్, కుడికాల జనార్దన్, మాలి విజయ్ రాజ్, జూలూరు నాగరాజు, సీత వెంకటేశ్వర్లు, షఫీ, జక్కోజు సత్య నారాయణ పాల్గొన్నారు.